బాజిరెడ్డికి నుడా చైర్మన్ శుభాకాంక్షలు

బాజిరెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 15 : బీఆర్ఎస్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు అరవింద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆదివారం బీ-ఫామ్ పొందడంపై కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అండర్-23 హెచ్‌సీఏ క్రికెట్ కెప్టెన్‌గా నితీశ్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 15 : జక్రాన్‌పల్లి జడ్పీటీసీ సభ్యురాలు తనూజా శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు నితీశ్‌రెడ్డి అండర్-23 హెచ్‌సీఏ రాష్ట్ర క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 26వ తేదీ నుంచి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నిర్వహించే మ్యాచ్‌లలో పాల్గొననున్నారు. క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైనందుకు సంతోషంగా ఉందని నితీశ్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా 'యువజనుల ఆదివారం'

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న యువతులు

డిచ్‌పల్లి, అక్టోబర్ 15 : మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో ఉన్న సీఎస్ఐ వెస్లీ చర్చిలో యువజనుల ఆదివారం కార్యక్రమాన్ని రెవరెండ్ దినాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన యువతకు ప్రత్యేక సందేశాలు అందించారు. యువత ఆధునిక పోకడల వైపు వెళ్లకుండా.. ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని బోధించారు. ఈ సందర్భంగా చర్చిలో యువత చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవరాజ్, పద్మారావు, ప్రభాకర్, సంజీవ్, ఇందిర, విజయ, కృప, ప్రతిమ పాల్గొన్నారు.

సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ధర్పల్లి, అక్టోబర్ 15 : ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వంశీకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో అంగడికి వచ్చిన ప్రజలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసి సైబర్‌నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇతరులకు బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. లక్కీడ్రాల పేరుతో ఫోన్ కాల్స్ వస్తే మోసపోవద్దని సూచించారు. బ్యాంకుఖాతా నుంచి డబ్బులు తీసినట్లు మెస్సేజ్ వస్తే వెంటనే సంబంధిత బ్యాంకు అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సంజీవ్, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్, హోంగార్డులు గోవింద్, నాంజీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గామాత

మండపాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు

జలాల్‌పూర్‌లో దేవీమాత విగ్రహానికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు, మోర్తాడ్‌లో..

ధర్పల్లి, అక్టోబర్ 15 : జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో దుర్గామాత నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలను ఆదివారం నెలకొల్పారు. అమ్మవార్లను గ్రామాల్లోకి తీసుకురాగా.. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారి విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు. యువకులు పెద్ద సంఖ్యలో మాలధారణ చేపట్టారు. దీంతో జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. సుద్దులంతో భవానీ మాలధారులు ర్యాలీ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని అమ్మవార్ల ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. న్యాల్‌కల్ రోడ్‌లోని లలితా దేవి ఆలయంలో గోసేవా సమతి ఆధ్వర్యంలో గోపూజ చేశారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో 105 మంది మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు.

పోచంపాడ్‌లో మండపం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కేదారేశ్వర ఆశ్రమంలో పూజలుచేస్తున్న మంగిరాములు మహరాజ్

అయ్యప్ప ఆలయంలో చోరీ

ఏర్గట్ల, అక్టోబర్ 15: మండల కేంద్రం శివారులోని భీమన్న గుట్ట వద్ద ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ జరిగినట్లు ఎస్సై మశ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. శనివారం అర్ధరాత్రి దొంగలు ఆలయంలోకి చొరబడి హుండీని పగులగొట్టి, అందులోని 2 వేల రూపాయలతో పాటు వంటశాలలోని గ్యాస్ సిలిండర్, ఇత్తడి వస్తువులను ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఎస్సై తెలిపారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానికులు తమకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి ఎంపిక

వర్షిత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

సిరికొండ, అక్టోబర్ 15 : మండలంలోని సత్యశోధక్ పాఠశాలకు చెందిన బి.వర్షిత్ అనే విద్యార్థి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య తెలిపారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్-13 మేజర్ లింక్ బేస్‌బాల్ కప్ -2023 పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వర్షిత్‌ను అమెరికాకు చెందిన ఎంఎల్‌బీ కప్ ఇండియా ఇన్‌చార్జి డేవిడ్ జ్ఞాపికతో సత్కరించారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్‌గౌడ్, జట్టు కోచ్‌లు అనిల్, నరేశ్, సంతోష్ జ్ఞాపికను అందజేసి, పూలమాలలతో ఆదివారం సత్కరించారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ఖలీల్‌వాడి, అక్టోబర్ 15 : ప్రింట్ మీడియా, డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు అర్బన్ ఏజెంట్స్, బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతి, భారత అణు పితామహుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం నిర్వహించారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ పత్రికల ఏజెంట్లు, బాయ్స్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 15 : జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొల్లం ముఖేశ్ (24) అప్పుల బాధ భరించలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తన తోట వద్ద గడ్డి మందు తాగగా.. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం

మోహన్

జక్రాన్‌పల్లి, అక్టోబర్ 15 : మండలంలోని పుప్పాలపల్లికి చెందిన చాట్ల మోహన్ అనే యువకుడు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మోహన్ ఓ కంపెనీలో సేల్స్‌మన్‌గా పని చేసేవాడని, ఈనెల 14న ఎప్పటిలాగే విధులకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య చాట్ల శ్రీలత ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భారత జాగృతి 'రూరల్' కన్వీనర్ల నియామకం

భారత జాగృతి రూరల్ నియోజకవర్గ మండల కన్వీనర్లు

ఇందల్వాయి, అక్టోబర్ 15 : భారత జాగృతి సంస్థాగత నియామకాల్లో భాగంగా రూరల్ నియోజకవర్గంలో కన్వీనర్లను ఆదివారం నియమించారు. వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశానుసారం ప్రధాన కార్యదర్శి నవీనాచారి సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు అవంతికుమార్, రూరల్ నియోజకవర్గ కన్వీనర్ మల్లెల సాయిచరణ్ ఆధ్వర్యంలో కన్వీనర్లను నియమించారు. డిచ్‌పల్లి మండల కన్వీనర్‌గాబెడద భాస్కర్, లావుడ్యా మహిపాల్ (ఇందల్వాయి), ఆకుల శ్రీకాంత్ (జక్రాన్‌పల్లి), బెల్దారి ధర్మేశ్ (ధర్పల్లి), సంగెం జయానంద్ (సిరికొండ), మేడ్చల్ కైలాస్ (మోపాల్), రూరల్ నియోజకవర్గ యూత్ కన్వీనర్‌గా కొర్రె సంతోష్‌నాయక్‌ను నియమించారు. నూతన బాధ్యులు సంస్థ ఆశయాలకు కట్టుబడి, శక్తివంచన లేకుండా కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు అవంతికుమార్ సూచించారు.

కార్యక్రమంలో జాగృతి సీనియర్ నాయకులు గంగాధర్‌గౌడ్, మల్లెల గంగాధర్, అవుసుల రాము, గంగాదాస్‌తో పాటు భారత్ జాగృతి కార్యకర్తలు అరవింద్, ఎల్. నరేశ్‌నాయక్, బి. పవన్‌నాయక్, మహిపాల్‌నాయక్, సుమన్‌నాయక్, గణేశ్‌నాయక్, గంగాధర్, సురేశ్, నితిన్, గణేశ్, నిఖిల్, సాయిప్రసాద్, జీవన్, సుధాకర్, సాయి, నాందేవ్, నరేశ్, రూపేశ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.